ప్రజాశక్తి

శుక్రవారం 6 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

జీవో నెం.1ని రద్దు చేయాలని

7న జిల్లావ్యాప్త నిరసనలు

- వామపక్ష పార్టీల పిలుపు
- ప్రజాస్వామ్యాన్ని హరించేందుకే

ప్రభుత్వం జీవో తెచ్చిందని విమర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రోడ్లపై సభలు, సమావేశాలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని ఈ నెల 7న జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. వామపక్ష పార్టీల సమావేశం గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్1 పైన వామపక్ష పార్టీల నాయకులు ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ 1861లో వచ్చిన 30 పోలీసు యాక్ట్ ద్వారా ఈపాటికే ప్రజా ఉద్యమాలమీద అనేక రకాలుగా నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు దానికి కొనసాగింపే జీవో నెంబర్ 1 అని వివరించారు. కందుకూరు, గుంటూరు లాంటి ఘటనలు గతంలో చాలానే జరిగాయని తెలిపారు. అవి ఇంటిలిజెన్స్, పోలీసుల వైఫల్యాలని పేర్కొన్నారు. ఆ ఘటనలను సాకుగా చూపి ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు, యువకులు, వివిధ వర్గాల ప్రజల పోరాటాలు ముందుకు వస్తున్నాయన్నారు. లోకేష్, పవన్ కళ్యాణ్ లాంటివారు యాత్రలు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. వీటిని అడ్డుకునేందుకే ప్రభుత్వం నూతన జీవోను తీసుకొచ్చిందని విమర్శించారు. పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించాలే తప్ప వారికి పూర్తిస్థాయి హక్కులను కట్టబెట్టడం సరికాదన్నారు. ఇలాంటి జీఓలే అమల్లో ఉంటే గతంలో జగన్ పాదయాత్రలు, సభలు, ఆందోళనలు చేసేవారా..? ▶ 2లో

జీవో నెం.1తో ఉద్రిక్తతలు

- ఒంగోలులో బాలకృష్ణ సినీ కార్యక్రమంపై ఇదే దుమారం
- తెలుగుదేశం, వైసిపి నేతల మధ్య ఆరోపణలకు ఆస్కారం
- జీవో రద్దుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

కొండపిలో జీవో నెం.1కి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధిస్తూ తెచ్చిన జీవో అమలులోకి వచ్చేసరికి ఉద్రిక్తత పరిస్థితులకు కారణమవుతోంది. ఇప్పటికే అన్ని ప్రతిపక్షపార్టీలూ దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ఉన్న ఈ జీవోను రద్దు చేయాలని తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ డిమాండ్ చేశాయి. నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. పలుచోట్ల జీవో ప్రతులను దగ్ధం చేసే కార్యక్రమాలు కూడా సాగుతున్నాయి. ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు, ఉద్యోగ సంఘాలు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆచరణలోకి వచ్చాక జీవో ఉద్దేశాలు ఎలా ఉంటాయో విదితమవుతోంది. జీవోలో రోడ్లపైనే పార్టీల కార్యక్రమాలను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇప్పుడు ఎక్కడ ఏ కార్యక్రమం పెట్టాలన్నా పోలీసుల ఆంక్షలు తీవ్రమయ్యాయి. ఇవి రాజకీయపార్టీల నడుమ మరింత ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసేలా కనిపిస్తున్నాయి. తాజాగా ఒంగోలు ఏబిఎం ఆటస్థలంలో వీరసింహారెడ్డి అనే సినిమా ప్రీరిలీజ్ కార్యక్రమం పెట్టారు. ఈ నెల 6న ఒంగోలుకు సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ కార్యక్రమానికి అతిథిగా వస్తున్నారు. ఇందుకోసం సినీయూనిట్ బృందం అక్కడ ఏర్పాట్లు చేస్తోంది. వేదిక ఏర్పాట్లు సగానికిపైగా పూర్తయ్యాయి. హఠాత్తుగా పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తర్జనభర్జనల అనంతరం దాన్ని త్రోవగుంట వద్ద బిఎంఆర్ సంస్థ కొత్తగా విల్లాలు కట్టే స్థలంలో అనుమతి ఇచ్చారు. దీని కోసం సినీ యూనిట్ ప్రతినిధులు పాలకపక్ష నేతలను అన్ని రకాలుగా వేడుకోవాల్సి వచ్చిందని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. ముందుగా అనుమతి ఇచ్చి రద్దు చేయడాన్ని తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తప్పుపట్టారు. ఉద్దేశపూర్వకంగానే అనుమతి నిరాకరించారని ఆయన దుయ్యబట్టారు. తాము తలుచుకుంటే జగన్ ఆనాడు పాదయాత్ర చేసేవారా? అని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు సరైనవి కావని ఆయన మాజీ మంత్రి బాలినేనిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీల నడుమ ఉద్రిక్తత వ్యాఖ్యలకు దారితీస్తున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. వీటికి ఆస్కారం ఇచ్చిందే జీవో నెంబరు 1. దీన్ని అడ్డుపెట్టుకునే పోలీసులు అనుమతి నిరాకరించారనే చర్చ లేకపోలేదు. పట్టణాల్లో రహదారులపైనే రోడ్‌షోలు, ర్యాలీలు నిషేధించారు. వాస్తవానికి ఇప్పటి వరకూ అన్ని పార్టీల రాష్ట్ర నేతలు రోడ్లపైనే రోడ్‌షోలు చేశారు. రోడ్ లేకుండా రోడ్‌షోలు ఎక్కడుంటాయనేదీ ఆలోచించాలి. అందరూ అదేదారిలో పోతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక పంథా.. అధికారంలోకి రాగానే ▶ 2లో

మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కృష్ణయ్య

భూసేకరణ చట్టం అమలు చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలి

▶ 5లో

పంట నష్టం

63,137 ఎకరాలలో..

- పంటలు కోల్పోయిన రైతులు 28,559 మంది..
- జిల్లాలో రూ.25.50 కోట్ల నష్టం
- ప్రభుత్వానికి తుది నివేదికలు పంపిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో జిల్లాలో రైతులు సాగు చేసిన 63,147 ఎకరాలలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 28,559 మంది రైతులు వారి పంటలను కోల్పోయారు. దెబ్బతిన్న పంటలతో రూ.25.50 కోట్లు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

జిల్లాలో మాండూస్ తుఫాన్ రైతులకు కన్నీటిని మిగిల్చింది. జిల్లాలో 63,137.5 ఎకరాలలో రైతులు సాగు చేసిన వివిధ పంటలు దెబ్బతిన్నాయి. వరి 326.66 హెక్టార్లల్లో దెబ్బతినగా 578 మంది రైతులు నష్టపోయారు. వరి పంటకు 49 లక్షల నష్టం వాటిల్లింది. మినుములు 14,698 హెక్టార్లలో దెబ్బతినగా 17,626 మంది రైతులు నష్టపోయారు. మినుముల పంటకు రూ.14.69 కోట్ల నష్టం వాటిల్లింది. మొక్కజొన్న 75.69 హెక్టార్లల్లో దెబ్బతినగా 140 మంది రైతులు నష్టపోయారు. మొక్క జొన్న పంటకు రూ.9.46 లక్షల నష్టం వచ్చింది. పెసలు 35.88 హెక్టార్లల్లో దెబ్బతినగా 36 మంది రైతులు నష్టపోయారు. ఈ పంటకు 3.56 లక్షల నష్టం వాటిల్లింది. అలసందలు 5526.95 హెక్టార్లల్లో దెబ్బతినగా 6,236 మంది రైతులు నష్టపోయారు. అలసందలు పంటకు 5.52 కోట్ల నష్టం వచ్చింది. పత్తి పంట 106.39 హెక్టార్లలో దెబ్బతినగా, 141 మంది రైతులు నష్టపోయారు. ఈ పంటకు రూ.15.85 లక్షలు నష్టం వాటిల్లింది. పొగాకు 4469.40 హెక్టార్లలో దెబ్బతినగా 3776 మంది రైతులు నష్టపోయారు. పొగాకు పంటకు 4.46 కోట్ల నష్టం వాటిల్లింది. వేరుశనగ 20.45 హెక్టార్లల్లో దెబ్బతినగా 26 మంది రైతులు నష్టపోయారు. రూ.3.07 లక్షల నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఎన్యుమరేషన్ చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందనుందని అధికారులు తెలిపారు.

ఒంగోలులోనే వీరసింహారెడ్డి ప్రీరిలీజ్

- 'అర్జున్ ఇన్‌ఫ్రా' గ్రౌండ్‌లో కార్యక్రమం
- రద్దీని దృష్టిలో ఉంచుకొని

ట్రాఫిక్‌ను ఆంక్షలు విధించిన పోలీసులు

'అర్జున్ ఇన్‌ఫ్రా' గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి చిత్రం ప్రీరిలీజ్ కార్యక్రమం నిర్వహించేందుకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ కార్యక్రమం ఒంగోలు నగర పరిధిలో జాతీయ రహదారి వద్ద, గతంలో మహానాడు నిర్వహించిన స్థలం వద్ద అర్జున్ ఇన్‌ఫ్రా లేఅవుట్‌లో నిర్వహించేందుకు పోలీసులు అనుమతించారు. సుమారు 17 ఎకరాల మైదానంలో ఆరు ఎకరాలలో నిర్వహిస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా చేస్తున్నారు. 20 వేల మందికి పైగా అభిమానులు వస్తారని భావిస్తున్నారు. అందుకు తగినట్లు గ్యాలరీలను నిర్మిస్తున్నారు. అక్కడకు వచ్చే అభిమానులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా గ్యాలరీల వారీగా ప్రవేశద్వారాలు నిర్మిస్తున్నారు. వాహనాలు నిలుపుకుపేందుకు స్థలం వంటివి చూపించడంతో పోలీసులు అనుమతులిచ్చారు. సభా ప్రాంగణం ఏర్పాటుచేసే ప్రాంతాన్ని ఏఎస్‌పి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ప్రీ రిలీజ్ కు ట్రాఫిక్ ఆంక్షలు

వీరసింహారెడ్డి ప్రీ రిలీజ్ ఫంక్షన్ ▶ 2లో

జీవో నెం.1తో ఉద్రిక్తతలు

(మొదటిపేజీ తరువాయి)

మరో పంథాలో పోవడమే ఇక్కడ చర్చించాల్సిన అంశం. ఈ పోకడ మంచిది కాదు. ఇప్పటివరకూ ఆందోళనలు, పోరాటాలు చేసే వామపక్షాలపైనా, కార్మికసంఘాలపైనా ఇలాంటి జీవోలు తెచ్చి నిర్బంధాలు ప్రయోగించారు. ఇప్పుడు ప్రధానపార్టీలకు కూడా తప్పడం లేదు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు పాల్గొన్న కందుకూరు రోడ్‌షోలో 8 మంది జనం చనిపోయారు. గుంటూరులోనూ పునరావృతమైంది. దీంతో హడావుడిగా తెచ్చిన జీవో వల్ల కుప్పంలో చంద్రబాబు సభలకు అనుమతి నిరాకరించారు. ఒంగోలులోనూ సిపిఐ కార్యక్రమానికి ఇదే తరహాలోనే అనుమతి నిరాకరించారు. ఇక్కడా హైడ్రామాలు నడుస్తున్నాయి. రాజకీయంగానే ఈ వ్యవహారాలను చూస్తున్నారు. ఇదే తరహాలో అనుమతుల పేరుతో ముందుకు పోవడం సాధ్యమేనా? అనేది ఆలోచించాలి. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే పార్టీలపైనా ఇదే తరహాలో ఆంక్షలు పెడితే నష్టం ప్రజలకే.. దీని వల్ల ప్రభుత్వం ఉద్దేశం నెరవేరుతుందా? ప్రజలకు ఇబ్బందులు పేరుతో ప్రజల కోసం సాగే పోరాటాలపైనా నిర్బంధాలు తప్పవంటున్నారు. వాస్తవానికి ప్రజాఉద్యమాలు ప్రభుత్వాలపైనే సాగుతాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు అనుకూలంగా లేకపోతే ఆయావర్గాల ప్రజానీకం గానీ, వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగకార్మికులుగానీ పోరాటాలు చేస్తారు. వాటికి అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదు. పోరాటాలకు అనుమతులు అనేది ఇప్పటివరకూ జరగలేదు. అంటే ఈ జీవోతో రానున్న కాలంలో ప్రజల తరుపున ఎవరూ రోడ్లపై ర్యాలీలు గానీ, ఆందోళనలు గానీ చేయడానికి వీల్లేదనే సంకేతాలు ఇప్పుడే వస్తున్నాయి. కలెక్టరేట్ వద్ద కనీసం నిరసన కార్యక్రమాలైనా చేపట్టే వీలుందా? లేదా? కూడా రేపోమాపో తేలనుంది.

7న జిల్లావ్యాప్త నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

అని ప్రశ్నించారు. జీవో అన్ని పార్టీలకు సమానమే అని చెబుతున్న ప్రభుత్వం కుప్పంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకొని రాజమహేంద్రవరంలో ప్రభుత్వ కార్యక్రమాన్ని మాత్రం అట్టహాసంగా జరిపిందని గుర్తు చేశారు. నూతన జీవోను అధికార వైసిపి పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ పాటికే ప్రజాఉద్యమాలమీద ప్రభుత్వ నిర్బంధాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జీవో తీసుకొచ్చి ప్రజల హక్కులను హరించాలని చూస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవో నెంబర్ 1ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జీవోకు వ్యతిరేకంగా ఈ నెల 7న జిల్లావ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. జీఓను రద్దుచేయాలని 7న జిల్లావ్యాప్తంగా నిరసనలు జరుగుతాయని, జిల్లా కేంద్రంలో సిపిఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ జీఓను దగ్ధం చేస్తామని తెలిపారు. సిపిఐఎంఎల్ జిల్లా నాయకురాలు లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులను హరిస్తుందని చెప్పారు. సిపిఐఎంఎల్ (న్యూడెమొక్రసీ) జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, న్యూడెమొక్రసీ నాయకులు ఎంఎస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌సిడిసిఎల్ సిఎండికి సన్మానం

ప్రజాశక్తి-కనిగిరి

ఎపిఎస్‌సిడిసిఎల్ సిఎండి పద్మజనార్దన్‌రెడ్డి గురువారం కనిగిరికి వచ్చారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మడతల కస్తూరిరెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం సిఎండి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీహరిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని చిలకపాడు గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బొలినేని కష్ణయ్య, వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపిపి బి. విజయ జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, తహశీల్దార్ శీలం శ్రీనివాసరావు, ఎంపిడిఓ ప్రసాద్, ఎఎంసి మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శి అన్నవరపు పెద్దబ్బాయి , ఎపిఎం సుధాకర్ రావు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **జరుగుమల్లి :** పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారాయణ, ఎంపిడిఓ పి.రామకృష్ణ, జడ్‌పిటిసి మాతంగి చంద్రలీల, వైస్ ఎంపిపి పులి బిక్షాలు, పల్లా అనూరాధ, ఎంపిటిసి పాటిబండ్ల భవాని, సర్పంచులు కొండాబత్తిన కృష్ణయ్య, బొట్లగుంట మాల్యాద్రి, కసుకుర్తి పున్నారావు, కసుకుర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు. **బల్లికురవ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షను వస్తుందని , ప్రతి పక్షం చెప్పే అబద్ధాలు ఎవరూ నమ్మద్దని వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణ చైతన్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి అంజలి, ఎంపిడిఓ కష్ణ, వైసిపి మండల కన్వీనర్ పేరయ్య తదితరులు పాల్గొన్నారు. **చీమకుర్తి :** ఇచ్చిన మాట నెరవేర్చే రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే



బల్లికురవలో పింఛన్లు అందజేస్తున్న కృష్ణచైతన్య

పింఛన్లు పంపిణీ చేస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ వెంకాయమ్మ

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కనిగిరి

మండల పరిధిలోని తక్కెళ్లపాడు ఎస్‌సి కాలనీకి చెందిన ఏడు కుటుంబాల వారు టిడిపి తీర్థం పుచ్చుకొన్నారు. పంచాయతీ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ మల్లెల శాంసన్ ఆధ్వర్యంలో టిడిపి లో చేరారు. టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు,టిడిపి మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, నాయకులు బేరి పుల్లారెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి,నారపురెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారిలో ఉగ్ర నరసింహారెడ్డి

రోడ్డు మార్జిన్‌లో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. మండల పరిధిలోని చిలకపాడు మద్దులూరు గ్రామాల మధ్యనున్న బి. మాచవరం గ్రామ సమీపంలో ఇనగలేరు వద్ద రోడ్డు సైడ్ మార్జిన్ పూర్తిగా కోతకు గురైంది. రోడ్డు క్రింది భాగంలో వేసిన పైపులు బయటపడ్డాయి. ఆ రహదారిపై వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్‌టిసి, స్కూల్ బస్సులు , టిప్పర్లు, ట్రాక్టర్లు ఈ హదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మలుపు వద్ద రోడ్డు మార్జిన్ కోతకు గురికావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డు మార్జిన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రమాద భరితంగా మారిన రోడ్డు మార్జిన్

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండల పరిధిలోని సోమేపల్లి గ్రామంలో సచివాలయ సముదాయంలో స్కూల్ నిర్మిస్తున్నారని గతంలో గ్రామస్తులు కొందరు కోర్టుకెళ్లారు. అందులో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఆదేశాల మేరకు వివాదాస్పదా స్కూల్ స్థల సముదాయాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతమాధవన్ గురువారం సందర్శించారు. గ్రామస్తులను విచారించారు. అనతరం రెవెన్యూ రికార్డులను పరిశీలించాఉరు. స్కూల్ కు నిర్వహణకు ఎటువంటి అభ్యంతరాలు లేవని స్కూల్ విద్య కమిటీతో రాత పూర్వకంగా తీర్మానం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ విజయ భాస్కర్, తహశీల్దారు కిరణ్, ఎంపిడిఒ మరియదాసు, ఎంఇఒ తులసి మల్లికార్జున నాయక్, పాఠశాల విద్యకమిటీ చైర్మన్ పాల్గొన్నారు.



వివాదాస్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

ఒంగోలులోనే వీరసింహారెడ్డి ప్రీరిలీజ్

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎయస్‌పి అడ్మిన్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు, నెల్లూరు వైపు నుండి వచ్చే వాహనాలు కిమ్స్ అండర్ పాస్ నుండి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో పార్కింగ్‌లో వాహనాలు నిలుపుకోవాలన్నారు. కర్నూల్ రోడ్ నుండి వచ్చే వాహనాలు మంగమ్మ కళాశాలలో ఏర్పాటుచేసిన పార్కింగ్‌లో నిలుపుకోవాలని తెలిపారు. ఈ ఆంక్షలు మధ్యాహ్నం నుండి ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ట్రాఫిక్ డిఎస్‌పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి పలమనేరు
క్యాంపు కోర్టు-కుప్పం
హెచ్ఎంఓపి నెం: 11/2022

మధ్య
కుప్పాల విశ్వనాథ్, తండ్రి: వెంకటరమణ
వయసు: 38 సం॥లు, హిందూ,
జూనియర్ అసిస్టెంట్, చిరునామా: రజకవీధి,
తాడిపత్రి టౌన్ అనంతపురం జిల్లా ... పిటీషనర్
మరియు
కుప్పాల రాధా, భర్త: విశ్వనాథ్, వయసు: 36 సం॥లు, హిందూ, గృహిణి,
నివాసం: కుప్పం, చిత్తూరు జిల్లా.
ప్రస్తుతం చిరునామా: వార్డు నెం: 7, శ్రీరామ్ నగర్, గిద్దలూరు గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా-523357, ఆంధ్రప్రదేశ్

రెస్పాండెంట్‌కు పిటీషనర్ నోటీసు

రెస్పాండెంట్‌పై పిటీషనర్ డైవర్స్ పిటీషన్‌ను పై కోర్టులో దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్ 30-01-2023కు వాయిదా వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లు అయితే సదరు తేదిన పై కనిన కోర్టు యందు ఉదయం 10:30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలసినదిగా కోర్టు వారు ఆదేశించి ఉన్నారు. కావున మీ అభ్యంతరాలను పై కనిన తేదీ మరియు సమయమందు పై కనిన కోర్టు యందు తెలుపని యెడల నీ పరోక్షమున పై పేర్కొన్న కేసును తీర్మానించడం జరుగుతుంది.

వాయిదా తేదీ: 30-01-2023 ఇట్లు
కె.వి.ప్రసాద్
పిటీషనర్ తరుపున వకీలు
కుప్పం-517425

ప్రజాశక్తి

శుక్రవారం 6 జనవరి 2023

పేదల బియ్యం కాజేస్తున్నారు

- అక్రమార్కులకు బాలినేని, అతని తనయుడి అండదండలు
- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే బాలినేని, అతని తనయుడి అండదండలతో వైసిపి నాయకులు బొక్కేస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆరోపించారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు నగరంలో సిండికేట్‌గా తయారై పేద ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా దోచు కుంటున్నారని, కావలికి చెందిన వ్యాపారుల వాహనాలు ఒంగోలు వచ్చి రేషన్ బియ్యాన్ని యద్దేశ్చగా తరలించుకు పోతున్నారని తెలిపారు. దీన్ని అడ్డుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదని విమర్శించారు. అక్రమార్కులకు మాజీ మంత్రి, ఆయన తనయుడి అండదండలు ఉన్నాయని నగరమంతా కోడై కూస్తుం దన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో ప్రజల అభివృద్ధి కంటే వైసిపి నేతల అభివృద్ధే అధికంగా ఉందన్నారు. ఇటీవల గ్రోత్ సెంటర్ పరిధిలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు పెద్దల ఒత్తిళ్లతో ఆకేసును మాఫీ చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ప్రజాశక్తి-తర్లుపాడు

కుక్కలదాడిలో మృతిచెందిన గొర్రెలు

మండల పరిధిలోని కేతగుడిపి గ్రామానికి చెందిన మేకల పెద్ద వెంకటయ్య, మేకల చిన్నవెంకటయ్య రోజులాగే గొర్రెలు బుధవారం సాయంత్రం కొష్టంలో తోలి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు కొష్టంలోకి చొరబడి గొర్రెలపై విచక్షిణరహితంగా దాడి చేశాయి. ఈ దాడిలో 30 గొర్రెలు మతి చెందాయి. బైనబోయిన శ్రీనుకు చెందిన మరో 15 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం కొష్టం వద్దకు వచ్చిన మేకల పెద్దవెంకటయ్య, మేకల చిన్న వెంకటయ్య విగత జీవులుగా పడి ఉన్న గొర్రెలను చూసి భోరున విలపించారు. కుక్కల దాడిలో మూడు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలి పారు. పశు సంవర్ధక అధికారులు మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. వైఎస్ఆర్ పశునష్ట పరిహారం పథకం కింద మృతిచెందిన గొర్రెలక ఒక్కొక్కదానికి రూ.6వేలు చొప్పున నష్ట పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గాయపడిన ద్రాక్షాయని

బైకును గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ యువతికి తీవ్ర గాయాలయ్యాయి. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటన మార్టూరు పట్టణం లోని హీరో షోరూమ్ ఎదురుగా గురువారం వేకువ జామున చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్రారెడ్డి కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన దిలీప్ కుమార్ రెడ్డి, అదే జిల్లా నగరికి చెందిన ద్రాక్షాయనితో కలిసి విజయవాడలో ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. అనంతరం బైకుపై స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో మార్టూరులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటుతున్న సమయంలో బైకును వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. డివైడర్‌ను ఢీకొనడంతో ద్రాక్షాయని తలకు తీవ్ర గాయమైంది. హెల్మెట్ ధరించి ఉండటంతో దిలీప్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన వాహనదారులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రవీంద్రారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ద్రాక్షాయని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నవరత్నాల'తో అందరికీ లబ్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

గడప గడకపూ ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

నవరత్నాలు పథకంలో రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరు తుందని మార్కా పురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వద్ది మడుగు, ఎస్‌సి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ అందరూ బాగుండాలని సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు, నాడు-నేడు, చేయుత, అమ్మఒడి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే అధికారులకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ శ్రీనివాసరావు, సర్పంచి పిన్నికి పిచ్చయ్య, ఎంపిటిసి చక్కర వెలిగొండయ్య, ఉపసర్పంచి బూదాల యూతమ్, వైసిపి మాజీ కన్వీనర్ రాచమల్ల వెంకట్రామిరెడ్డి, ఎస్‌సిసెల్ మండల నాయకులు సిహెచ్. కోటేశ్వరరావు, ఇజ్రాయిల్, ఏసేబు, చిన్నకోటేశ్వరరావు, ఎపిఎం గోపాలకష్ణారెడ్డి, గనివెనపాడు సర్పంచి పాలూరి లక్ష్మి వెంకటేశ్వర్లు, ఇమ్మానియేల్, ఎఒ ప్రసన్న రంగలక్ష్మి. సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సడ్డీ మెటీరియల్ అందజేస్తున్న రోటరీ క్లబ్ నాయకులు

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని బండ్లమూడి, ఆర్ఎల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ గురువారం అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు గోల్లపూడికోటేశ్వరరావు చౌదరి సమకూర్చిన స్టడీ మెటీరియల్ 115 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కాంతారావు, స్వప్నరాజ, రోటరీక్లబ్ నాయకులు శ్రీనివాస మూర్తి, ముప్పూరి చలమయ్య, వీరారెడ్డి,తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చాకు కూలీలకు గాయాలు

ప్రజాశక్తి- మద్దిపాడు

ఆటో బోల్తాకొట్టిన ఘటనలో 8 మంది పచ్చాకు కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నేలటూరు సమీపంలో రోడ్డు మలుపువద్ద గురువారం చోటు చేసుకుంది. దేనువకొండ మండలం వేలమూరు గ్రామానికి చెందిన పచ్చాకు కూలీలు పనులకు ఆటోలో గురువారెడ్డి పాలెం వస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆటో రోడ్డు మలుపు వద్ద బోల్తాకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పద్మ, పులి అంజయ్య, ఏడుకొండలు, నాగలక్ష్మి, చిన్నమ్మాయి, సుజాత, అంజమ్మ అనే వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ తరలించారు. స్థానిక ఎస్ఐ శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద భరితంగా మారిన చప్టా ఇదే...

ప్రమాదకరంగా చప్టా

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహన చోదకులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు మండలం బండివారి పాలెం గ్రామ శివారులోనున్న కొప్పరం చెరువు అలుగువాగు పై ఉన్న చప్టా కుంగిపోయి శిథిలావస్థకు చేరింది. ఈచప్టాపై నుంచి అద్దంకి నుంచి బల్లికురవ, సంత మాగులూరు మీదుగా నరసరావుపేట ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అధిక లోడుతో గ్రానైట్ లారీలు తిరుగుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో చప్టా కుంగిపోయింది. దీంతో ఎక్కడ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఈచప్టాపై మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పలు దొంగతనాల కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసినట్లు బాపట్ల డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల వద్ద నుంచి కంప్యూటర్లు, సిలిండర్లు, గ్యాస్‌స్టవ్‌లు, ఇత్తడి బిందెను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం....జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న నిందితులను బాపట్ల సూర్యలంక రోడ్డులో అరెస్టు చేశారు. నిందితులు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి.కష్ణయ్య, ఎస్ఐలు షేక్ మహమ్మద్. రఫీ, సిహెచ్.సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సంతమాగులూరు

హైదరాబాదు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొమ్మాలపాడు గ్రామంలో బస్టాండ్ సెంటర్ సమీపంలో అద్దంకి, నార్కెట్ పల్లి రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గంధం రవి (58) అక్కడికక్కడే మతి చెందాడు. మృతుడు తెల్లవారుజామున రోడ్డు ప్రక్కన ఉన్న టీ స్టాల్‌లో టీ తాగాడు. అనంతరం స్కూటీపై ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో స్కూటీని బస్సు ఢీకొంది. దీంతో రవి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నాగ శివారెడ్డి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపట్నం : ప్రకృతి వ్యవ సాయంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి శ్రీనివాస రావు తెలిపారు. మండల కేంద్రమైన కొత్తపట్నం గ్రామంలో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫెస్ట్ సర్వే లెన్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పేస్ట్ సర్వే లెన్స్ గురించి ప్రకతి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రకతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు , మండల వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

10 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని పీర్ల చావిడి వద్ద డబల్ డిజిట్ నెంబర్ (మట్కా) జూదం ఆడుతున్న 10 మందిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె మల్లికార్జున తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు తిరుపతయ్య

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పంగులూరు

ఉపాధ్యాయులు అంటే రోజూ పాఠశాలకు వచ్చి నెల నెలా జీతం తీసుకొనే వారనే అభిప్రాయముంది. ఈ తరణంలో జీతాలు తీసుకోవటమే కాదు, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతామని నిరూపిస్తున్నాడు ఆ ఉపాధ్యాయుడు. ఎంత కష్టపడైనా విద్యార్థులకు పాఠాలు నేర్పి, వారిని ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాడు. ఆయనే కొండమంజులూరు దళిత కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాలపర్తి తిరుపతయ్య. పంగులూరు మండలం చిన్న మల్లవరం గ్రామం తిరపతయ్య స్వగ్రామం. ఆయన ప్రస్తుతం మండలంలోని కొండ మంజులూరు దళిత కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈ పాఠశాలలో 72 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ గతంలో ఐదు గురు ఉపాధ్యాయులు ఉండేవారు. గత మూడేళ్ల కాలంలో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇప్పుడు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. 72 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు చదువు

ద్విచక్ర వాహనంపై విద్యార్థులను బడికి తీసుకెళ్తున్న తిరుపతయ్య

చెప్పటం కష్టమైన పనే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేస్తూ ఉపాధ్యాయులను తగ్గిస్తుంది. కొత్త ఉపాధ్యాయులను నియమించడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన తిరుపతయ్య మాస్టారు తన సొంత డబ్బులతో ముగ్గురు నిరుద్యోగులను వాలంటీర్లుగా నియమించుకున్నాడు. ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున ముగ్గురికి కలిపి నెలకు.24 వేలు ఇస్తున్నాడు. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థులలో ఆలోపం కనపడకుండా చెప్పే చదువులో ఎలాంటి అశ్రద్ధ లేకుండా ఉండటానికి వాలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తిరుపతయ్య చెబుతున్నాడు. తనకొచ్చే జీతం నుంచే నెల, నెల ఒకటో తేదీనే వాలంటీర్లకు జీతం అందిస్తున్నాడు. కరోనా సమయంలోనూ వాలంటీర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు పాఠశాలకు రాకపోయినా నెలనెలా జీతం చెల్లించాడు. దళిత కాలనీలోని చిన్నారుల తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తుండటంతో కొంతమంది పిల్లలు పాఠశాలకు రాకుండా ఇంటి దగ్గరే ఉండే వారు. వారు చదువులో వెనకబడతారని భావించిన తిరుపతయ్య పాఠశాలకు హాజరు కాని పిల్లల ఇళ్లకు వెళ్లి తన స్కూటర్‌పై వారిని ఎక్కించుకొని పాఠశాలకు తీసుకొస్తుంటాడు. ప్రతిరోజు నూటికి నూరు శాతం హాజరు ఉండేటట్లు చర్యలు తీసుకుంటాడు. విద్యార్థుల అవసరాలు తీరుస్తూ క్రమశిక్షణగా వారికి విద్యా బోధన చేస్తున్నాడు. అందుకనే తిరుపతయ్య మాస్టారు అంటే విద్యార్థుల్లోనే కాకుండా, తల్లిదండ్రుల్లో కూడా మంచి గౌరవం ,మర్యాద ఉంది. తిరుపతయ్య మాస్టర్ లాంటి ఉపాధ్యాయుడు ఉంటే ఆ పాఠశాలలో ఇబ్బందులు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అందుకే ఆదర్శ ఉపాధ్యాయుడు తిరుపతయ్య మాస్టారు అంటారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

ప్రజాశక్తి-పర్చూరు

పాత మద్రాసు రోడ్డులో పర్చూరు-ఇంకొల్లు మధ్య రోడ్డు విస్తరణ కోసం 3 అడుగుల లోతున గుంతలు తవ్వి వదిలిపెట్టారు. ఆ గుంతల వద్ద ప్రమాదాలు జరుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బి పరిధిలోని రహదారి విస్తరణకు ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేసి మూడేళ్లు గడిచినా ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. రోడ్డు అంచుల్లో నమూనాల కోసం పలు చోట్ల 3 అడుగుల లోతున 50 అడుగుల పొడవున 6

రహదారి మార్జిన్‌లో ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరికలు

నెలల క్రితం ప్రొక్లయినర్‌తో గుతలు తవ్వారు. రాత్రి సమయాలలో దగ్గరకు వచ్చే వరకూ గుంతలు కనిపించటం లేదు వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎస్ఐ జివి. చౌదరి గుంతల వద్ద కర్రలు పాతించి వాటికి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయించారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం తగదు : సిపిఎం

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై నిర్బంధం మాను కోవాలని, సభలు, నిరసనలను నిషేధిస్తూ తెచ్చిన జీవో నంబరు 1 రద్దు చేయాలని కోరుతూ స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో సిపిఎం నేతలు నిరసన తెలిపారు. అనంతరం జీవో నంబర్ 1 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ సభలు, ర్యాలీలను, నిరసనలను నిషేధిస్తూ తెచ్చిన జీవో నంబర్ 1ను రద్దు చేయాలన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం లోకి రాకముందు నిర్వహించిన పాదయాత్రలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించ లేదా అని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలలో వచ్చే వ్యతిరేకత నోరు నొక్కడానికే ఈ జీవో తెచ్చినట్లు తెలిపారు. సభలు, ర్యాలీలు నిర్వహించుకోవడం, నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులలని తెలిపారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గతంలోనే జాతీయ ఉద్యమంలో అనేకమంది దేశ ప్రజలు పాల్గొన్నట్లు తెలిపారు. ఏదో ఒక సభలో జరిగిన పొరపాట్లను సాకుగా చూపుతూ నిరసనలు, సభలు నిషేధిస్తూ జీవోలు ఇవ్వడం చట్ట విరుద్ధమనిఆ తెలిపారు. జీవో నంబరు 1ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రమేష్, డి.శ్రీనివాసరావు, ఎ. వెంకటేశ్వరరావు, యు.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవో కాపీలను దహనం చేస్తున్న నాయకులు

ప్రదర్శనలపై నిషేధం అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

కొండపి : ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామిక హక్కులను హరించటం అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. రోడ్ షోలు, ర్యాలీలు, సభలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ వన్ తక్షణమే రద్దు చేయాలని కోరుతూ స్థానిక బస్టాండ్ సెంటర్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలతిపారు. అనతరం జీవో నంబర్ వన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన పాలకులు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటాన స్వేచ్చను హరించే విదంగా చట్టాలు చేయడం సిగ్గుచేటు అని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనాలను నిషేధించడం, ఎలుకలు, ఉన్నాయని ఇల్లు తగలబెట్టడం లాంటిదే ఈ జీవో అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేసేందుకు ప్రజాస్వామ్యయుతంగా ప్రదర్శనలు, సభలు, రోడ్ షో లాంటివి నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. పాలకులుకు ప్రజాస్వామ్యం మీద ఏ మాత్రం విశ్వాసం ఉన్నా అలాంటి వాటిని నిషేధించకూడదని తెలిపారు. ఈ పాటికే కార్మిక కర్షక కష్టజీవులు, ఉద్యోగ వర్గాలు అనేక రూపాలలో ఆందోళన నిర్వహిస్తుంటే ముందస్తుగానే పోలీసులు ద్వారా ప్రభుత్వం అరెస్టు చేయించడం, నిర్భందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఉంటే ముందు రోజే ముఖ్య కార్యకర్తలు అందరిని గృహ నిర్భందమో, పోలీసుస్టేషన్‌ల్లో పెట్టడమో చేస్తున్నారని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కెజి. మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ రైతాంగం ఒక సంవత్సరం పాటు ఢిల్లీ కేంద్రంగా వీరోచత పోరాటం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో ప్రజలపై అనేక భారాలు మోపినట్లు తెలిపారు. వాటికి వ్యతిరేకంగా ప్రజల్లో వస్తున్న చైతన్యాన్ని అణిచి పెట్టేందుకు ప్రభుత్వం ఇలాంటి చట్టాలు తెచ్చిందని విమర్శించారు. సిపిఐ మండల నాయకురాలు ఆర్. లక్ష్మి మాట్లాడుతూ ప్రజల గొంతు నొక్కే చర్యలకు వైసిపి ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గడ్డం వందనం, వై.రూబెన్, ఎల్.సుధాకర్, పి.ఆదాం, ఎం.జయరాంరెడ్డి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, శ్రీను , పిచ్చయ్య, సిపిఐ నాయకులు పురుషొత్తం పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం కొనేటిపురంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, ఎంపిపి డివి.లలితకుమారి విస్తతంగా తనిఖీలు చేపట్టారు. మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయంలో పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు శాతం, పౌష్టికాహార వినియోగానిన పరిశీలించారు.సచివాలయ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైతులతో పశువుల పెంపకంపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి టి.ఉదయ్ భాస్కరి,గ్రామ సర్పంచి మోర్ల వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి ఉషారాణి, వైసిపి మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, కార్యదర్శులు టి.అనురాధ, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని పేదకొత్తపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. వసంత కుమారి తెలిపారు. గత నెల 29న స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో అండర్ -14 విభాగంలో కె.యస్వంత్, ఎన్. జ్యోతిర్మయి, ఎస్, ఫ్రైజీ, అండర్-17 విభాగంలో వి. కిషోర్ బాబు, షేక్ రషీద్ బాబు, వి, సుమ, ఎం, చరణ్య పి. వరలక్ష్మి పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈనెల 21,22,23, తేదీలలో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు గురువారం అభినందించారు.

ఆటల పోటీల ప్రారంభోత్సవంలో సబ్ కలెక్టర్ మాధవన్

ఆటల పోటీలు

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని కలుజువ్వలపాడులోనున్న జవహర్ నవోదయ విద్యాలయం-2లో గురువారం వార్షిక ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ ప్రారంభించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు తప్పనిసరిగా ఆటలు ఆడాలన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తమకు ఇష్టమైన క్రీడలను ఎంచుకొని అందులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కార్యనిర్వాహక ఉపాయుక్తులు ప్రసాదరావు, రాజంపల్లి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ జితేందర్‌సింగ్ మీనా, విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, పిఇటి ప్రభుదాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

భూమి పూజ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజారోగ్యానికే ప్రథమ ప్రాధాన్యత: కలెక్టర్

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామీణప్రాంత ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కషి చేస్తోందని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని వల్లూరు గ్రామంలో 60 వేల నీటి నిల్వ సామర్థ్యం గల ఓహెచ్‌ఆర్ నూతన ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వల్లూరు దళిత కాలనీ ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని కుందం శేషారెడ్డి - కమలమ్మల జ్ఞాపకార్థం కుమారుడు రైల్ వన్ ప్రాజెక్ట్ ఎండీ కుందం కోటిరెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో మురుగునీరు పారుదల సౌకర్యం కోసం కాలనీలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీని ఎంపీ మాగుంట, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రారంభించారు. తొలుత కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కొండపి వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబులు వల్లూరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. వల్లూరమ్మ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బద్దెపురి రమేష్ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎంపీ లకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లూరు పద్మ, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ పి అజిత, మండల వైసీపీ అధ్యక్షులు సూదనగుంట శ్రీహరిరావు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, కొండపి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, టంగుటూరు పిఏసీఎస్ అధ్యక్షులు రావూరి ప్రవీణ్, వల్లూరమ్మ దేవస్థానం పాలకవర్గం చైర్మన్ కాలే శ్రీనివాసులు, ఎంపీటీసీ యల్లసిరి సత్యవాణి, గ్రామ నాయకులు కుందం హనుమారెడ్డి, విష్ణురెడ్డి, కుందం శ్రీనివాస రెడ్డి, వెంకారెడ్డి, తక్కెళ్ళపాటి సుధాకర్ పాల్గొన్నారు

మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

మనుగడ కోసం టిడిపి తాపత్రయం

నగర మేయర్ గంగాడ సుజాత విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

తెలుగుదేశం పార్టీ నాయకులు ఒంగోలు నగరంలో తమ ఉనికిని, మనుగడను కాపాడుకునేందుకు తాపత్రయ పడుతున్నారని నగర మేయర్ గంగాడ సుజాత విమర్శించారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బకింహెూం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ వద్ద మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పెద్ద మొత్తంలో కమిషన్‌లు తీసుకున్నారని ఆరోపించారు. ఆయన వద్ద మరో రూ.10కోట్లు చేబదులుగా తీసుకున్నారని కూడా చెప్పారు. నగరంలో మరో 10మంది కాంట్రాక్టర్ల వద్ద వివిధ రూపాల్లో డబ్బు తీసుకున్నారని విమర్శించారు. డబ్బులు తీసుకున్న వారికి ఇవ్వకుండా కనిపించకుండా పోవడం జనార్ధన్ నైజమని చెప్పారు. బకింహెూం కెనాల్‌మీద బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు అక్కడ ఆందోళనలు చేయడం ఏంటని ప్రశ్నించారు. నగరంలో ఎవరి సత్తా ఏంటో రానున్న ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తేలుతుందని చెప్పారు. సమావేశంలో వైసిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షులు కటారి శంకర్, యువజన విభాగం అధ్యక్షులు గంటా రాము, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, మాధవి, అరుణ, మాజీ కౌన్సిలర్ బొమ్మినేని మురళి పాల్గొన్నారు.

'ప్రైవేటు' ఉపాధ్యాయులకు అండగా 'పిడిఎఫ్'

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు కూడా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉండి.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఆయన గురువారం రాచర్ల మండలంలోని అనేక గ్రామాలు తిరిగారు. గ్రామాల్లోని ప్రముఖ రాజకీయ నాయకులను, పట్టభద్రులను, వివిధ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థల ఉపాధ్యాయులకు ఏ హక్కులు, రాయితీలు, పథకాలు వర్తించటం లేదన్నారు. చిన్నచిన్న విద్యాసంస్థల యాజమాన్యాలు కార్పొరేట్ దూకుడుకు తట్టుకోలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వీరికి తోడుగా నిలబడి వారి అభివద్ధికి కషి చేస్తామన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు, సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక నెంబర్‌తో గుర్తింపు కార్డు ఇవ్వాలని, సంస్థల వారీగా వీరి పేర్లు డిఇఒ వెబ్‌సైట్లో పొందు పరచాలన్నారు. ఎక్కడ పని చేసినా ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడే అనే భరోసా ప్రభుత్వం కల్పించాలని, గతంలో శాసనమండలిలో చర్చ జరిగిందని, భవిష్యత్తులో అమలు కోసం కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పి.స్వరూపరెడ్డి, సిఐటియు నాయకులు టి.ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

భూసేకరణ చట్టం అమలు చేసి

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-కనిగిరి

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా నష్టపరిహారం అందేలా 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హెూంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు కంటే మూడు రెట్లు ఎక్కువగా చెల్లించాలని కోరారు. జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ న్యాయమైన నష్టపరిహారం కోసం భూ పోరాటాలు నిర్వహించేందుకు నిర్వాసితులు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారులు నిర్వాసితుల పట్ల దౌర్జన్య ధోరణి విడనాడి పరిహారం అందించేందుకు చొరవ చూపాలని, లేనిపక్షంలో అందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. హైవే రోడ్డు నిర్మాణం ఒక్క అడుగుకూడా ముందుకు పడదని అన్నారు. ఎన్జీవో హెూం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిఎస్‌పురం భూ బాధితుల సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు రాయళ్ల మాలకొండయ్య, బాధితులు ఎస్‌కె బారాయిమాం, పేరం పుల్లారెడ్డి, బి ఓబుల్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, ఒంటిపెంట వెంకటేశ్వర్లు, గుంటక శ్రీరాములురెడ్డి, రత్నారెడ్డి, కెవిపిఎస్ నాయకులు రత్నం, మాల్యాద్రి, ఆదినారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిర్వాసితుల సంఖ్యను

కుదించే ప్రయత్నం మానుకోవాలి

- పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి - సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లోని నిర్వాసితుల సంఖ్య కుదించే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులను పూర్తి స్థాయిలో ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ముంపు గ్రామాల్లో 2006లో, 2019లో రెండు దఫాలుగా సర్వే చేయడం జరిగిందన్నారు. ఈ రెండు సర్వేల ద్వారా 7,340 మంది నిర్వాసితులుగా అర్హత ఉన్నట్లు సర్వే అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ఆ సంఖ్యను కుదించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. మరోమారు అర్జీలు పెట్టుకోవాలని అధికారులు చెప్పడంలో అర్థం లేదన్నారు. ఏప్రిల్ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజిలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి ముంపు గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. ఆయా సభల్లో నిర్వాసితులు పాల్గొని నిర్వాసితులను మోసగిస్తున్న ప్రభుత్వ తీరుపై అధికారులను నిలదీయాలని నిర్వాసితులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వెలిగొండ ప్రాజెక్టు పోరాట కమిటీ కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, సిపిఎం నాయకులు డికెఎం రఫి, ఎం.షంషీర్ బేగ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

పంటల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల మండలంలోని అయినముక్కలలో సాగు చేసిన మినుము, జొన్న పంటలను మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం మినుము పంటలో సస్య రక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రబీ 2022-23 కాలంలో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ బుకింగ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

భోజనం రుచి చూస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి

పేదల ఆకలి తీర్చేందుకే

'అన్నా క్యాంటీన్'

- ట్రైల్ రన్ సక్సెస్ - నేడు ప్రారంభం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో నిర్మించిన అన్నా క్యాంటీన్‌కు సంభందించి ట్రైల్ రన్‌ను కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం చేపట్టారు. ఆయనతో పాటు టిడిపి శ్రేణులు అన్నా క్యాంటీన్‌లో భోజనం రుచి చూశారు. ట్రైల్ రన్ విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటుచేస్తే వారి నోటికాడ అన్నం తీసేసేలా క్యాంటీన్‌లు తొలించారని అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న ఆశయం, చంద్రన్న సంకల్పంతో ఉగ్రన్న ఆచరణతో అన్న క్యాంటీన్‌ను సొంతంగా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. తన సొంత నిధులతోపాటు, టిడిపి శ్రేణులు,ప్రజలను భాగస్వామ్యులు చేసేలా ఆహ్వానించగా స్వచ్చందంగా స్పందిస్తున్నారన్నారు. ఈ నెల 6న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించటం జరుగుతుందన్నారు.

రూ.5 లక్షల విరాళం

ఈనెల 6న ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళాల సేకరణను డాక్టర్ ఉగ్ర జనవరి 1న శ్రీకారం చుట్టగా గురువారం కనిగిరికి చెందిన నీలిశెట్టి సుబ్బారావు రూ 5లక్షల విరాళం అందజేసి భాగస్వామి అయ్యారు. విరాళం అందించిన నీలిశెట్టి సుబ్బారావును డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పేదల ఆకలి తీర్చటంలో అందరు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పదేపదే వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో స్పందన కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుండి పదే పదే వచ్చే అర్జీలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి తరచుగా వస్తున్న అర్జీల పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. జిల్లాలో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు సంబంధించి పూర్తి సమాచారం తెప్పించుకుని పరిష్కార మార్గాలను చూపారు. స్పందన అర్జీలు పరిష్కరించడానికి వీలుకానివి సరైన కారణంతో అర్జీ దారులకు తెలియజేయాలన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలం కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయం-2లో వార్షిక ఆటల పోటీలను నిర్వహించారు. గురువారం ఉదయం జరిగిన ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మార్కాపురం డివిజన్ సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కార్యనిర్వాహక ఉపాయుక్తులు సిహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా రాజంపల్లి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ జితేందర్‌సింగ్ మీనా పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, పిఇటి ప్రభుదాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని పెదఅలవలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 40 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పిసి కమిటి అధ్యక్షులు చెన్నపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బండారు రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కె.కరుణకుమారి, విఆర్‌ఓ అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఏవో

ప్రజాశక్తి-పొదిలి

రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్ముకొని లబ్ధి పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్ అన్నారు. గురువారం మండలంలోని తలమళ్ల గ్రామంలో మాదాలవారిపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ కొత్తపులి బ్రహ్మారెడ్డి, సొసైటీ సిఇఒ సుధాకర్‌రెడ్డి, సబ్ డివిజనల్ సహకార సంఘం అధికారి బివిఎస్ క్రిష్ణశాస్త్రీ, ఇఎఎ అమృతకళ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని ఏలూరివారిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, సర్పంచ్ ఏలూరి శ్రీలక్ష్మి, వైసిపి నాయకులు ఏలూరి సుబ్బారావు, ఏలూరి సురేష్, ఎస్ భాస్కరరెడ్డి, మండల పశువైద్యాధికారి వెంకటరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'సస్యరక్షణ'పై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-జరుగుమల్లి

పొగాకు పంటపై సస్యరక్షణ చర్యలు, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై మండలంలోని వావిలేటిపాడులో రైతులకు, బోర్డు క్షేత్ర సిబ్బందికి గురువారం పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, ఎస్‌జిఒ జి.సునీల్‌కుమార్, క్షేత్రాధికారి వెంకట్రావు, ఐటిసి వెంకట్రావు, ఎఫ్ఎఎ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'మాగుంట'ను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-తర్లుపాడు

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని మండలంలోని కలుజువ్వలపాడు వైసిపి కార్యాలయంలో మండల నాయకులు గురువారం కలిశారు. పార్టీ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, రామసుబ్బారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు డి.పెద్దమస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి: బూచేపల్లి

ప్రజాశక్తి-కురిచేడు

ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో రాణించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గురువారం ఆమె మండలంలోని పొట్లపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా 59 మంది 10వ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌ఒన్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వి.భవ్య, యం.ఇ.ఒ. ఆర్.వస్త్రాంనాయక్, కురిచేడు గ్రామ సర్పంచ్ కె. కృష్ణయ్య, పొట్లపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వాకా వెంకటేశ్వరరెడ్డి, జడ్.పి.టి.సి. నుసుం వెంకట నాగిరెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, వూట్ల వెంకటేశ్వర్లు, గోగులమూడి

ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

లింగారెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, యు.టి.ఎఫ్. మండల కమిటీ అధ్యక్షుడు అన్నెం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కురిచేడు మండల పరిషత్ అధ్యక్షురాలు బెల్లం కోటేశ్వరమ్మ గైర్హాజరవటం గమనార్హం.

దర్శిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దరిశి

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు దరిశి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దరిశి నగర పంచాయతీ ఛైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, సిఐ రామకోటయ్య గురువారం ప్రారంభించారు. మొత్తం పురుషులలో 10 టీమ్‌లు, మహిళలలో 6 టీమ్‌లు ఈ పోటీలో పాల్గొంటున్నట్లు నగర పంచాయితీ వైస్‌ఛైర్మన్ స్టీవెన్, దస్తావేజుల లేఖరి అప్పికట్ల చెంగలరాయుడు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రావణ్ కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మేత అంజిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి,

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కౌన్సిలర్లు విసి రెడ్డి, మోహన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ తలారి కోటయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా..

ప్రజాశక్తి-టంగుటూరు

యుటిఎఫ్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి ప్రవేశపెట్టిన యుటిఎఫ్ సంఘం ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా ఉంటుందని యూటీఎఫ్ టంగుటూరు మండల అధ్యక్షులు కాట్రగడ్డ రమేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక చెల్లెమ్మ తోటలోని పారా శ్రీరాములు స్వగృహంలో ఆయన సతీమణి పారా రాజ్యలక్ష్మికి యూటీఎఫ్ సంక్షేమ సంఘం నిధి నుండి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని యుటిఎఫ్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొణికి పూర్ణశ్రీ పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌ను పరామర్శిస్తున్న శిద్దా రాఘవరావు

మంత్రి సురేష్‌కు శిద్దా పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాతమూర్తి థెరీసమ్మ సంస్మరణ సందర్భంగా మార్కాపురం జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మంత్రిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పరామర్శించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ జి సుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో టి.రవి, ఆదిశేషు పాల్గొన్నారు.

'శ్రీరామ్'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్యం చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు గుంటూరు రోడ్డులోని టిడిపి ఆఫీసు వెనుక ఉన్న శ్రీరామ్ మల్టీ న వా వ ర్ స్పె షా లి టీ హాస్పిటల్‌లో ప్రతి నెలా మొదటి గురువారం జరిగే ఉచిత వైద్య శిబిరంలో భాగంగా గురువారం మల్టీ స్పెషాలిటీ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మంది ఉచితంగా వైద్యాన్ని పొందారు. వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్లు, నరములు, స్త్రీల సమస్యలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సమస్యలు, ఛాతి, ఊపిరితిత్తులు, దంత సమస్యలు, బిపి, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు, కొలెస్ట్రాల్, గుండె, కిడ్నీ, లివర్, నరాల సమస్యలు, మెదడు, పక్షవాతం, ఫిట్స్ వ్యాధులకు, ఫిజియోథెరపి సమస్యలకు వైద్యసేవలందిం చారు. ఇందులో అందరికీ ఉచిత ఓపీతో పాటు ఎముకల పటుత్వ పరీక్ష, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ పరీక్ష ఉచితంగా, రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు రాయితీపై చేశారు. శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాల వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్.వంశీ కష్ణ, గర్భ కోశ, ప్రసూతి, సంతానలేమి, హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ శాంతకుమారి, జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్, షుగర్, బిపి, థైరాయిడ్, కొలెస్ట్రాల్ వైద్య నిపుణులు డాక్టర్ సానల ధీరజ్‌బాబు, జనరల్ మరియు లేపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సున్నపు విజయ్‌కుమార్, ఊపిరితిత్తులు, ఛాతి, నెమ్ము, ఆయాసం వైద్యనిపుణులు డా.నాగిడి కుమార్‌వర్మ, డెంటల్ అండ్ కాస్మొటిక్ స్పెషలిస్ట్ డా.సున్నపు నవీన, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్, రీహాబిలిటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఓ ఎం.రామసుబ్బ రంగయ్య ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని బోయలపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని తెలిపారు. మూమెంట్ రిజిష్టర్ ఖచ్చితంగా మెయింటింగ్ చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

ప్రజాశక్తి-అర్ధవీడు

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. వైయస్ఆర్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అర్ధవీడులో వైయస్సార్ పెన్షన్ కానుక పథకంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరావు, జడ్పీటీసీ విజయమ్మ, మాజీ ఎంపిపి రవికుమార్ పాల్గొన్నారు.

జీవో నెం.1కి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జీవో నెంబర్.1కి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్లో గురువారం నిరసన తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు జీవో ప్రతులను దహనం చేసేందుకు ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. తర్వాత టిడిపి నాయకులు జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కరిముల్లా, మాబు, ఇస్మాయిల్, మస్తాన్‌వలీ, శనగా నారాయణరెడ్డి, కోట డేవిడ్, కామేపల్లి వెంకటేశ్వర్లు, తోట మహేష్ నాయుడు, కందుల నారాయణరెడ్డి, సత్యనారాయణ గౌడ్, వెంకటరావు పాల్గొన్నారు.

మార్కాపురం: రాష్ట్రంలో వైసిపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, వైసిపి పాలనలో కొనసాగుతున్న అరాచకాలే అందుకు కారణమని తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అరాచక పాలనకు అద్దం పడుతోందన్నారు. గురువారం స్థానిక

టంగుటూరు బస్‌స్టాప్ సెంటర్‌లో మాట్లాడుతున్న టిడిపి నేతలు

టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. సమావేశంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిడిపి ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

దరిశి: సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిషేధించే జిఒను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, నాయకులు సంగా తిరుపతిరావు, గాలెయ్య, దినకర్, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టంగుటూరు: జీవో నెంబర్.1ని వెంటనే రద్దు చేయాలని టిడిపి టంగుటూరు మండల, పట్టణ అధ్యక్షులు కామని విజయకుమార్, కామని నాగశ్రీను డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక బస్టాప్ సెంటర్లో జీవో నెం.1కి వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జీవో ప్రతులను దహనం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షులు అబ్బూరి అభిషేక్, ఎస్సీ సెల్ రాష్ట్ర, నియోజకవర్గ కార్యదర్శులు ధర్నాసి బ్రహ్మానందం, కసుకుర్తి భాస్కర్, కామని శ్రీను, సవలం సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
శుక్రవారం 6 జనవరి 2023

వైసిపి ఇన్‌ఛార్జి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి

టిటిడి ఛైర్మన్‌ను ఆహ్వానించిన ఆమంచి

ప్రజాశక్తి-వేటపాలెం

వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను అధిష్టానం నియమించిన విషయం పాఠకులకు విదితమే.రేపో,మాపో బాధ్యతలు చేపట్టేందుకు కృష్ణమోహన్ రంగం సిద్ధం చేసుకొంటున్నారు. నూతలపాడులో మూడు కోట్ల రూపాయలతో నిర్మించనున్న టిటిడి కళ్యాణమండపం శంకుస్థాపనకు టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో తన బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి హాజరు కావాలని వైవి. సుబ్బారెడ్డిని కృష్ణమోహన్ గురువారం ఆహ్వానించారు. తాడేపల్లిలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి స్వయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కారంచేడు, పర్చూరు, చిన్నగంజాం, మార్టూరు, ఇంకొల్లు,యద్దనపూడి మండలాల నుంచి భారీగా జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. చీరాల నుంచి కూడా కృష్ణమోహన్ అనుచరణగణం సమయాత్తం అవుతోంది. రాజకీయపరిణాల నేపథ్యంలో కేవలం నాలుగు రోజుల్లోనే ఆమంచి కృష్ణమోహన్ పర్చూరు బాధ్యతలు చేపట్టనున్నారు.


వైవి. సుబ్బారెడ్డిని ఆహ్వానిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

కృష్ణమోహన్ ఇంట అధికారులు,నాయకుల సందడి

ఆమంచి కృష్ణమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వస్తున్న అధికారులు, నాయకులతో ఆయన ఇంట కోలహలం నెలకొంది. కృష్ణమోహన్‌ను కలిసిన వారిలో పర్చూరు పంచాయతీ రాజ్ డిఇ శ్యాంప్రసాద్, యద్దనపూడి ఎంపిపి రజని, ఎస్ఐ రత్నకుమారి, దుద్దుకూరు వైసిపి నాయకులు శ్రీనివాస్, చిన్నగంజాం, ఎంపిడిఒ డి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో టిడిపి నాయకులు

'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు తెలిపారు. మండల పరిధిలోని పుట్టా వారి పాలెం సమీపంలో నున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తమకు ఇదేం కర్మ అంటూ నిట్టూరుస్తున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని గ్రామాలలో వార్డులు వారీగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించాలన్నారు. శుక్రవారం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలప్రోలు రమేష్, మాజీ ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, కొప్పక కొండలు, చేవూరి వాసురెడ్డి, నక్కా పెదగాలెయ్య, ధూపాటి ఏసోబు, కొనికి శ్రీనివాసరావు, వసంత వేణుబాబు, గుండపునేని సురేష్, దేవా, షేక్ ఆఫీజ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కర్లపాలెం

మండల పరిధిలోని గణపవరం రైతు భరోసా కేంద్రం వద్ద సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. విత్తనం. ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించడానికి, పంటకు తొలి దశలో ఆశించే రసం పీల్చు పురుగులను అరికట్టడానికి విత్తనశుద్ధి తప్పనిసరి అని తెలిపారు. అసరాలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరిస్తూ రైతులు పంటగా కంచెగా పొలం చుట్టూ మూడు లేదా నాలుగు వరసల్లో జొన్న, మొక్కజొన్న, సజ్జ పైరు సాగు చేయాలన్నారు. తద్వారా వైరస్ తెగుళ్లను వ్యాపింజేసే తామర పురుగులను నివారించడంతోపాటు మిత్రమా పురుగులను ఆకర్షించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ సుమంత్, ఎఇఒ భార్య లక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు వేదశ్రీ, రైతులు పాల్గొన్నారు.

వైసిపి పరిరక్షణ సమితి నాయకులపై పెట్టిన

అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి వైసిపి పరిరక్షణ సమితి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని కోరుతూ బాపట్ల ఎస్పి వకుల్ జిందాల్‌కు శింగర కొండ దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. టిటిడి ఛైర్మన్ వైవి. సుబ్బారెడ్డి సూచనలు మేరకు ఎస్పిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో వైసిపి పరిరక్షణ సమితి నాయకులపై అక్రమ కేసులు పెట్టినట్లు తెలిపారు. అక్రమ కేసులను రద్దు చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఎస్పి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎస్పిని కలిసిన వారిలో వైసిపి నాయకులు జాగర్లమూడి యలమందరావు, కుందుర్తి రాఘవరెడ్డి, పమిడిపాడు సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

ఎస్పిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

కల్యాణమండపం నిర్మాణానికి సిద్ధం చేసిన స్థలం

కల్యాణ మండపం నిర్మాణానికి ఏర్పాట్లు

పర్చూరు : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మండల పరిధిలోని నూతలపాడులో కల్యాణ మండపం నిర్మించనున్నారు. అందులో భాగంగా భూమిని సిద్ధం చేశారు. సంక్రాంతి లోపు శంకుస్థాపన చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి టిటిడి రూ. 2 కోట్లు మంజూరు చేసింది .రూ.3 కోట్లు ఇవ్వాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేయగా పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మండప నిర్మాణానికి రూ.50 లక్షలతో స్థలం కొనుగోలు చేశారు. ఆళ్ళ మహేంద్రరెడ్డి విరాళంగా ఇచ్చారు. రూ.50 లక్షలు టిటికి గ్రామస్తులు వాటాగా అంద జేశారు. స్థలం అభివృద్ధి కోసం రూ. 7 లక్షలు ఖర్చు చేశారు. కళ్యాణ మండపం నిర్మాణ బాధ్యతులు చూసేందుకు నూతన కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా కె.బాపిరెడ్డి, కార్యదర్శిగా బి. రాజగోపాల్‌రెడ్డి, 13 మందిని కమిటీ సభ్యులుగా ఎనుకున్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు సహకారంతో బస్టాండ్, రహదారి కి ఇరువైపుల రాత్రి పూట నిద్రించే పేదలకు గురువారం దుప్పట్లు అందజేశారు. నాగభైరు వంశీకష్ణ ఆర్థిక సహకారంతో 30 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కాసా అశోక్‌కుమార్, పాబొలు ఉదయ భాస్కర్, కోట శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, పి.చంద్రం, లంకా లక్ష్మణ్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా వైద్యాధికారి

సర్టిఫికెట్లు అందజేత

ఇంకొల్లు : గ్రామీణ ప్రాంత వైద్యులు వైద్య చికిత్సలో మెళకువలు నేర్చుకోవాలని గుంటూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమయాఖాన్ తెలిపారు. గ్రామీణ వైద్యులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంకొల్లు మండలానికి చెందిన గ్రామీణ వైద్యులు రావినూతల శ్రీనివాసరావు, బిరుదు నాగేశ్వరరావు, షేక్ హసన్, ఆర్.రాఘవరావుకు సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్వేయర్ వెంకటేశ్వర్లు

తక్కెళ్లపాడులో గ్రామసభ

సంతనూతలపాడు రూరల్ : సమగ్ర భూ సర్వే రీసర్వేలో భాగంగా మండలపరిధిలోని పి తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వే నేపథ్యంలో రైతులందరూ ఒక్క తమ పొలాలకు సంబంధించి అభ్యంతరాలను సందేహాలను నివత్తి చేసుకునే విధంగా సరిహద్దు రాళ్ళను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి ఆలూరి సుశీల, కార్యదర్శి వెంకటేశ్వర్రావు, గ్రామ సర్వేయర్ సుధాకర్, విఆర్ఒ కె. శ్రీదేవి, గ్రామ నాయకులు ఆలూరి వెంకటేశ్వర్లు, చలపతి, ప్రసాద్, పెద్ద బ్రహ్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

ఏపిసిపిడిసిఎల్ సిఎండి జె.పద్మజనార్ధన్‌రెడ్డి

రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సిఎండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఏపిసిపిడిసిఎల్ సిఎండి జె పద్మజనార్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీవో ఎంఎస్ 22 ప్రకారం పెడుతున్న స్మార్ట్ మీటర్ల వల్ల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవన్నారు. మీటర్ల ఏర్పాటుకు రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. రైతులు ఎన్ని యూనిట్లు వినియోగిస్తారో.. దానికయ్యే చార్జీలను మొత్తం ప్రభుత్వమే నేరుగా రైతుల ప్రత్యేక ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డీబీటీ) కింద జమచేస్తుందన్నారు. ఆ డబ్బు నేరుగా రైతుల ద్వారా డిస్కంలకు బదిలీ అవుతుందన్నారు. ఈ ప్రక్రియల వల్ల పూర్తి పారదర్శకత ఉంటుందని పేర్కొన్నారు. కరెంటు సరఫరా కంపెనీలను ప్రశ్నించేహక్కు రైతులకు లభిస్తుందన్నారు. కంపెనీలకు కూడా బాధ్యత పెరుగుతుందని తెలిపారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు పగటిపూట తొమ్మిదిగంటల నిరంతర విద్యుత్తును సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్తు కొనుగోలుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుతును అందించడానికి సుమారు రూ.1,700 కోట్లు ఖర్చుచేసి ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు.

పలు విద్యుత్ సమస్యలపై అర్జీలు

ముఖాముఖి కార్యక్రమం సంధర్భంగా వినిమోగదారులు, రైతుల నుండి అధిక మొత్తంలో అర్జీలు అందాయి. వాటిలో 70 శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ కెవిజి సత్యనారాయణ, మార్కాపురం ఈఈ వి.నాగేశ్వరరావు, ఈఈ టెక్నికల్ ఒంగోలు ఎ.సత్యనారాయణ, ఎస్ఏఓ కె సుబ్బారావు, ఏఓ రెవెన్యూ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన..

గొప్ప మాతృమూర్తి 'థెరిసమ్మ'

- విద్యారంగ అభివృద్ధికి ఆమె కృషి వెలకట్టలేనిది
- 'థెరిసమ్మ' సంస్మరణ సభలో పలువురు వక్తలు

మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమని విద్యా సంస్థలు నెలకొల్పటం, తద్వారా ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన గొప్ప మాతృమూర్తి చెరుకూరి థెరిసమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం థెరిసమ్మ సంస్మరణ సభ స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యా రంగ అభివద్ధి కోసం ఆమె చేసిన కషిని పలువురు వక్తలు కొనియాడారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. జిల్లాలోనే మొదటి ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పటం అంటే అప్పట్లోనే జార్జి, థెరిసమ్మలకు ఉన్న ముందుచూపును కొని యాడారు. ఎందరినో విద్యావంతులుగా చేయ టమే కాకుండా, తమ బిడ్డలను కూడా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. కర్నూలు, ఆత్మకూరు, మార్కాపురంలలో నెలకొల్పిన జార్జి విద్యాసంస్థల ద్వారా విద్యాభివద్ధికి ఎంతో కషి చేశారన్నారు. డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎద గటమే కాకుండా సిఎం మనస్సు లోనూ గొప్ప స్థానాన్ని సంపాదిం చుకున్నారని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆది మూలపు కుటుంబానికి అండగా ఉంటామని, ఇంకా గొప్పగా జార్జి థెరిసమ్మల ఆశయ సాధనకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో థెరిసమ్మ కుమారులు రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, కరణం బలరాం, టిజెఆర్ సుధాకర్ బాబు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎం.శేషగిరి రావు, రాష్ట్ర ఎస్సీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, మాల కార్పొరేషన్ చైర్మన్ అమ్మాజీ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివసారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళిక్రిష్ణ, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ మీర్జా షంషీర్ అలీభేగ్, వెన్నా హనుమారెడ్డి, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే టిజెఆర్

విద్యాప్రమాణాలు మరింతగా పెంచాలి

కలెక్టర్ విజయకృష్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యాప్రమాణాలు మరిం తగా పెంచాలని జిల్లా కలెక్టరు కె విజయకష్ణన్ ఆదేశించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వ హణపై సంబంధిత ప్రధానాచార్యులతో గురువారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్లో ఆమె సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చక్కగా చదువుకునే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గురుకుల పాఠశాలల్లో కల్పించాలని కలెక్టరు చెప్పారు. విద్యార్థులలో సజనాత్మకతను వెలికితీయాల న్నారు. వారి నైపుణ్యాలకు మెరుగులుదిద్దాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ నియంత్రించాలని ఆదేశించారు. బాపట్ల జిల్లా పరిధిలో రెండు బాలుర, ఆరు బాలికల గురుకుల పాఠశాలలు నడుస్తున్నా యని చెప్పారు. అందులో 4321 మంది విద్యా ర్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు విద్యాబోధన అందించాలన్నారు. డ్రాపౌట్స్ కారణాలపై సర్వే నిర్వహించి నివేదిక పంపాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో నైపుణ్యం సాధిం చడానికి అధ్యయన తరగతులు నిర్వహిం చాలన్నారు. పాఠశాలలను సమర్ధంగా నడపా లని కలెక్టరు చెప్పారు. వివిధ పాఠశాలల్లో మురుగునీటి సమస్య, వంటగ్యాస్ సమస్య పరిష్కరించాలని ప్రధానాచార్యులు కలెక్టరు దష్టికి తెచ్చారు. మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకోసం ప్రణాళికలు రూపొందించాలని కలెక్టరు ఆదేశించారు. రేపల్లె, యద్దనపూడి, అద్దంకి పాఠశాలల్లో ఆర్వోప్లాంట్ల ఏర్పాటు, మరమ్మతులకోసం తక్షణమే చర్యలు తీసు కోవాలన్నారు. విద్యార్థులకు త్రాగునీటి సమస్య రానివ్వరాదని కలెక్టరు సూచిం చారు. గురుకుల పాఠశాలల్లో విద్యా కుసుమాలు వికసించేలా విద్యాబోధన ఉండాలని కలెక్టరు విజయకష్ణన్ ఆదేశిం చారు. ప్రత్యేక అధికారులు ప్రతి గురువారం తనిఖీ చేసే సమయాలలో సిబ్బంది సహకరించాలన్నారు. పాఠశాల లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పర్యావరణం, సామాజిక బాధ్యతపై విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగే వేదికగా పాఠశాలలను తీర్చిదిద్దాలని పలు సూచనలు చేశారు. నరసాయపాలెం పాఠశాలలో సౌర విద్యుత్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలని కలెక్టరు ఆదేశించారు. వివిధ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల ద్వారా పరిపాలన వ్యవస్థ కుంటు పడకుండా మానవవనరులను సమకూర్చు కోవాలని కలెక్టరు చెప్పారు. ఈ సమావేశంలో గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ సి శాంతి విశాల, ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డిఆర్ఒ ఓబులేసు ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎపిపిఎస్‌సి ఈ నెల 8వ తేదీన నిర్వ హించనున్న గ్రూప్ -1 సర్వీసుల స్క్రీనింగ్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదేశించారు. జిల్లాలోని 7 కేంద్రాలలో ఈ పరీక్షను నిర్వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తన ఛాంబరులో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఓఎంఆర్ షీట్ల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ఎపిపిఎస్‌సి జారీ చేసిన ఆదేశాలను అందరూ పాటించాలని స్పష్టం చేశారు. 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈ పరీక్షలు ఉండటంతో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బిఎఫ్-7 కోవిడ్ వేరియంట్ దష్ట్యా పరీక్షా కేంద్రాలలో కోవిడ్ ప్రొటోకాల్ పక్కాగా పాటించాలని ఆయన తెలిపారు. ఆయా కేంద్రాలలోకి అభ్యర్థులను అనుమతించేటప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేయా లని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో తక్ష ణమే స్పందించేలా వైద్య సిబ్బందిని అందు బాటులో ఉంచాలని, పరీక్షా సమయాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థులకు అవసరమైన ప్రభుత్వ రవాణా సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని డిఆర్ఒ అదేశించారు.

రాష్ట్రంలో నియంత పాలన

- జనాదరణతో కదులుతున్న తాడేపల్లి పీఠం
- చీకటి జీవో నెంబర్ 1ను ఉపసంహరించుకోవాలి
- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల డిమాండ్

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో జగన్ రెడ్డి నేతృత్వంలో నియంత పాలన కొనసాగుతుందని, ప్రశ్నించే ప్రతి పక్షాల గొంతు నొక్కుతున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు విమర్శించారు. స్థానిక ఒంగోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ వైసిపి నాయకులు రోడ్ షోలు, బహిరంగ సభలు, ఎన్ని ఫ్లెక్సీలైనా పెట్టుకోవచ్చని, ప్రతిపక్షాలు చిన్న కార్యక్రమం చేసుకున్న జీవోలతో నిలిపివేస్తున్నారన్నారు. ,చంద్రబాబు నాయుడు రోడ్ షోలకు, సభలకు లక్షలాదిమంది ప్రజలు తరలివస్తుంటే ఓర్వలేని వైసిపి కుట్రలు పన్నుతుందన్నారు. కందుకూరు, గుంటూరు చంద్రబాబు నాయుడు సభల్లో జరిగిన అపసతులు కేవలం పోలీస్, ప్రభుత్వ వైఫల్యమేని విమర్శించారు. ప్రజలు లక్షలాదిగా తరలివస్తుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణమన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు రోడ్లపైకి రాకుండా మానేస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు సభలు రోడ్షోలు అడ్డుకునేందుకు ప్రభుత్వం 1861 యాక్ట్‌లో జీవో నెంబర్ 1 విడుదల చేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడుకి వస్తున్న జనాదరణతో తాడేపల్లి పీఠం కదులుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి సభలకు వాలంటీర్ల ద్వారా ప్రజలను తోలుతుంటే వారు గోడలు దూకి వెళ్లిపోయే దుస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు సభలు,రోడ్డు షోలతో పాటు జనవరి 26న జరిగే లోకేష్ బాబు "యువ గళం" పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలో భాగమే జీవో అని తెలిపారు. 1861 యాక్ట్ జీవోను వెంటనే రద్దుచేసి, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులను కొనసాగిస్తూ చంద్ర బాబు నాయుడు రోడ్ షోలు, సభలకు పోలీస్ కల్పించాలని డిమాండ్ చేశారు. చీకటి జీవో ఎంఎస్ నెంబర్ 1ను వెంటనే ఉపసంహరిం చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై ఆంక్షలు సరికాదు

ఒంగోలు లో ప్రముఖ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ నటించిన 'వీర సింహారెడ్డి' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆంక్షలు విధించటం సరికాదన్నారు. ఈ ఫంక్షన్‌ను ఒంగోలు లో నిర్వహించాలని నిర్మాతలు డైరెక్టర్ ముందే అనుకున్నారని, ఏబిఎం ప్రాంగణం లో అనుమతి తీసుకోని పనులు దాదాపుగా పూర్తి చేసుకున్నారన్నారు. ఫంక్షన్ ఆక్కడ చేస్తే అనుమతి ఇవ్వలేమని, మార్చుకోవాలని చెప్పటం ఎంత వరకు సమంజసమన్నారు. సినిమా ఫంక్షన్లను రాజకీయం చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు వైవి సుబ్బారావు, మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, బండారు మదన్, చుండి శ్యామ్ పాల్గొన్నారు.